www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 26 | సెప్టెంబర్ | 2025
పేజీలు : 7

## సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యునిగా కూనంనేని
### సిపిఐ జాతీయ సమితి సభ్యులుగా బాగం , సాబీర్ పాషా

2లో





# ఎందుకు అలసత్వం..
# ఎక్కడున్నది లోపం..!




-పాలక వర్గ సమన్వయ లోపమా..?
-నేడు కెఎంసిలో కలెక్టర్ రివ్యూ

ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్‌లో కొందరి అలసత్వం, పాలక వర్గ సమన్వయ లోపం ఇబ్బందికరంగా మారింది. కమిషనర్ సహా ఉన్నతాధికారుల నిర్ణయాలు సహేతుకంగా ఉన్నా కొందరి మితిమీరిన జోక్యం ప్రత్యేకించి పలు డిపార్టుమెంట్లలో తిష్టవేసిన అవినీతి అధికారుల వ్యవహారశైలి మొత్తం కార్పోరేషన్ అభివృద్ధికి ఆటంకంగా మారింది. గతంలో పలు విభాగాలకు సంబంధించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులను గెలుచుకున్న ఖమ్మం మున్సిపల్

మిగతా 2లో..

## నేటి నుంచి మద్యం షాపులకు టెండర్లు

-టెండర్ రుసుము రూ. 3లక్షలు
-ఖమ్మం జిల్లాలో 122 దుకాణాలు
-భద్రాద్రి కొత్తగూడెంలో 88 దుకాణాలు



ప్రజాపక్షం/ఖమ్మం : మద్యం షాపులకు టెండర్ ప్రక్రియ నేటి నుంచి ప్రారంభం కానుంది. మద్యం షాపులను దక్కించుకునేందుకు టెండర్ ఫీజును ఈ ఏడాది మూడు లక్షలుగా నిర్ణయించారు. గతంలో రెండు లక్షలు ఉండేది. గతంలో టెండర్ ప్రక్రియ 2023 ఆగస్టు మాసంలో ప్రారంభమైంది. ఈ ఏడాది ఈనెల 26 నుంచి అక్టోబర్ 18 వరకు మద్యం షాపులకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అక్టోబర్ 23న లాటరీ పద్దతిలో లిక్కర్ షాపులను కేటాయించనున్నారు. లాటరీలో మద్యం షాపులను దక్కించుకున్న వారికి డిసెంబర్ ఒకటి నుంచి 2027 నవంబర్ 30 వరకు లైసెన్స్‌ను ప్రభుత్వం జారీ చేస్తుంది. మొత్తం షాపుల్లో 15 శాతం గౌడ కులస్తులకు, 10 శాతం ఎస్సిలకు, ఐదు శాతం ఎస్టిలకు కేటాయించనున్నారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 122 దుకాణాలుండగా ఖమ్మం 1 స్టేషన్ పరిధిలో 24, ఖమ్మం 2 స్టేషన్ పరిధిలో 17, నేలకొండపల్లి స్టేషన్ పరిధిలో 15, వైరాలో 13, మధిరలో 20, సత్తుపల్లిలో 23, సింగరేణిలో 10 ఉన్నాయి. అయితే వీటిలో కొన్నింటిని తగ్గించే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా గతంలో122 మద్యం దుకాణాలకు గాను 7207 దరఖాస్తులు వచ్చాయి. తెలంగాణతో పాటు ఆంధ్రాలోని మద్యం వ్యాపారులు పెద్ద సంఖ్యలో టెండర్లను దాఖలు చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 88 షాపులకు గాను 44 షాపులు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నాయి. ఎస్సిలకు ఏడు, గౌడలకు ఆరు, జనరల్ కేటగిరి క్రింద 31 షాపులు కేటాయించారు. జిల్లా వ్యాప్తంగా 12 బార్లు ఉన్నాయి. తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు మద్యం వ్యాపారులు టెండర్ వేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

## ఘనంగా బతుకమ్మ వేడుకలు



-పాల్గొన్న మంత్రి పొంగులేటి
-పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని పెరికసింగారం గ్రామంలో బతుకమ్మ వేడుకల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జూపూడి గోపాలరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 54 అడుగుల బతుకమ్మ వద్ద మహిళలతో కలిసి మంత్రి చప్పట్లతో అడుగులు వేశారు. ఈసందర్భంగా మంత్రి మహిళలకు గ్రామ ప్రజలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. 54 అడుగులు బతుకమ్మతో ఏర్పాటు చేసిన బతుకమ్మ పట్ల గ్రామ ప్రజల ప్రేమ ఆప్యాయతలను మంత్రి కొనియాడారు. ఇంత పెద్ద పండుగ చేసుకోవడం ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. బతుకమ్మ తల్లి దీవెనలతో గ్రామంలో పిల్లాపాపలంతా పాడి పంటలతో బాగుండాలని ఆడబిడ్డల కోరికలు ఆ బతుకమ్మ తీర్చాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన...

మండలంలోని బాగాద్వీడు, మంగళ్‌తండా, ఈశ్వర మాదారం గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చే సీసీ రోడ్డు పనులకు

మిగతా 2లో..

## స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ సత్తా చాటాలి

-ఎన్నికలు పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతుంది
-ఖమ్మం నియోజక వర్గ సమావేశంలో మాజీ మంత్రి పువ్వాడ, ఎంపి వద్దిరాజు, మాజీ ఎంపి నామ



## ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం



-పట్టా ఉన్న చేనులో పంటను పీకేసిన అధికారులు
-చేతికొచ్చిన పంట నేలపాలు
-కన్నీరు పెట్టుకున్న రైతు కుటుంబికులు

2లో

# ఎందుకు అలసత్వం..ఎక్కడున్నది లోపం..!

(మొదటిపేజీ తరువాయి)
కార్పొరేషన్ ఇప్పుడు ఎందుకు విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటుందన్న దానిపై ప్రజల్లో విస్తృతంగా చర్చ సాగుతుంది.రాష్ట్ర స్థాయిలో పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు చెందిన వారు వచ్చి స్వయంగా ఖమ్మం అభివృద్ధిని పర్యవేక్షించారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. చిన్నచిన్న లోపాలు అభివృద్ధికి ఆటంకాలుగా మారాయి. పాలక వర్గం విపక్ష, స్వపక్ష కార్పొరేటర్ల సలహాలను తీసుకోవడంలో వైఫల్యం చెందుతుంది. ఏదైనా కార్యక్రమాలు ప్రారంభించే ముందు ఆయా సంబంధిత కార్పొరేటర్లను ముఖ్యంగా ఫ్లోర్ లీడర్లను పిలిచి అభివృద్ధి పనులపై గత పాలక వర్గాలు సమీక్షించేవి. సీనియర్ కార్పొరేటర్ల సలహాలు తీసుకునేవి. కానీ ఇప్పుడు పాలక వర్గం తాము చేసిందే నిర్ణయం, చెప్పిందే మాట అన్నట్లుగా వ్యవహరిస్తుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. కనీసం ఆయా డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనులకు సైతం సంబంధిత కార్పొరేటర్లను సంప్రదించడం లేదన్న ఆవేదన కార్పొరేటర్ల నుంచి వ్యక్తమవుతుంది. ఇక నిధుల ఖర్చు, జమల విషయంలో కూడా పారదర్శ కత లోపించిందని కొన్ని ఆరోపణలు వినపడుతున్నాయి. కార్పొరేటర్లతో కూడిన స్టాండింగ్ కమిటీ లేకపోవడం అధికారులు పాలక వర్గానికి, కార్పొరేటర్లకు మధ్య అనుసంధానంగా వ్యవహరించక పోవడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడుతుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. పారిశుధ్యంతో పాటు కార్పొరేషన్ కార్యాలయంలో కొందరి తీరు జవాబుదారితనంగా లేకపోవడం కూడా విమర్శలకు తావిస్తుంది. నిత్యం వచ్చే ప్రజలకు సమాధానం కూడా సరైన రీతిలో లేదన్నది స్పష్టమవుతుంది. ఇప్పటికైనా కార్పొరేటర్లతో కూడిన స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు 60 మంది కార్పొరేటర్లతో కూడిన ఖమ్మం కార్పొరేషన్‌లో కార్పొరేటర్లను అభివృద్ధి పనుల్లో సమన్వయం చేయడంతో పాటు జవాబుదారితనంగా ఉంచితే పాలక వర్గానికి ఒత్తిడి తగ్గడంతో పాటు అభివృద్ధి పనులు వేగంగా జరిగే అవకాశం ఉంది. పాలక వర్గంపై అవినీతి ఆరోపణలు లేకపోయినా సమన్వయం లోపం ఉందన్న విమర్శకు సమాధానం ఇచ్చినట్లు అవుతుంది.

**నేడు కలెక్టర్ సమీక్ష...**

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌పై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం సమీక్షించనున్నారు. గతంలో సమీక్షించిన సందర్భంలో పారిశుధ్యం, కార్యాలయ నిర్వహణ తదితర విషయాలపై మరోమారు సమీక్షిస్తానని చెప్పిన కలెక్టర్ శుక్రవారం సమీంచనున్నారు. సమీక్షకు సైతం విపక్ష, స్వపక్ష కార్పొరేటర్లను ఆహ్వానిస్తే కొన్ని విషయాలు తెలుసుకుని సరి చేసే అవకాశం ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది.

# స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ సత్తా చాటాలి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ సత్తా చాటాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలను పురస్కరించుకుని ఖమ్మం నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ పార్టీ సమావేశం మమత క్యాంపస్ నందు నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపి నామ నాగేశ్వర రావు లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయలేక క్యూలైన్లలో నిలబెడుతున్నారని ఆడవాళ్లు సైతం క్యూ లైనులో నిల్చోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రేవంత్‌రెడ్డి అబద్ధపు హామీలు నెరవేర్చలేక కేసిఆర్‌పై నిందలు మోపుతున్నారన్నారు. కాళేశ్వరం కూలిపోయిందని చెబుతూనే హైదరాబాద్‌కు కాళేశ్వరం నీళ్లు తీసుకు వస్తామని శంకుస్థాపనలు చేస్తున్నారన్నారు. రైతులకు రుణమాఫీ, రైతు భరోసా, నిరుద్యోగ భృతి, నాలుగువేల రూపాయల పింఛన్, ఆడపిల్లలకు స్కూటీలు, కళ్యాణలక్ష్మి తులం బంగారం వంటి హామీలను అమలు చేయకుండా కాలం గడుపుతూ ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ఇట్టి హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన మోసాన్ని వివరించి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. తనపై తప్పుడు ప్రచారాలతో శునకానందం పొందుతున్నారని అజయ్‌కుమార్ తెలిపారు. మనిషి అన్న తర్వాత ప్రతి ఒక్కరికి ఏదో ఒక సమస్య వస్తుందని దానికి కొంత మంది నన్ను ఎదుర్కొనలేక ఖమ్మంలో పోటీ చేయడు ఇక రాడు అని ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కేసిఆర్‌ను సిఎం చేసే వరకు, కేటిఆర్‌ను సిఎంగా చేసే వరకు తనకు ఏమి కాదని నేను ఇక్కడే ఉంటా మీకు అండగా ఉంటానన్నారు. ఎంపి వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపి నామ నాగేశ్వరరావు లు మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పి బిఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. పాలన చేతకాక బిఆర్ఎస్‌పై, కేసిఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి బిఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, మాజీ డిసిసిబి ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆర్‌జెసి కృష్ణ, సొసైటీ ఛైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, మాజీ వైస్ ఎంపిపి గుత్తా రవి, రఘునాథపాలెం మండల అధ్యక్షులు వీరునాయక్, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ఖమర్, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ, మెంతుల శ్రీశైలం, అమరగాని వెంకన్న, హరిప్రసాద్, ఆత్మ మాజీ ఛైర్మన్ లక్ష్మణ్ నాయక్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యం





**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఒక పక్క ప్రకృతి కన్నీరు పెట్టిస్తుంటే మరో పక్క యూరియా కష్టాలతో రైతులు ఇబ్బంది పడుతుంటే చేతికి వచ్చిన పత్తి పంటను ఫారెస్ట్ అధికారులు అర్ధరాత్రి వచ్చి సుమారు రెండు ఎకరాలు పత్తి చేనును మొత్తం పీకే వేసినారని ఆళ్లపల్లి మండల పరిధిలోని రాయపాడు గ్రామ నివాసి నాగేశ్వరరావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోతుల కాపలా కోసం రోజువారీగా ఉదయం చేను దగ్గరికి వెళ్లగా పంట మొత్తం పీకేసే ఉన్నదని అది చూసినా గుండు ఆగినంత పని అయిందని, అతను వారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు పెట్టారు. మాకు ఈ పంట చేను గత 20 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్నామని, తెలంగాణ ప్రభుత్వం పోడు పట్టా కూడా ఇచ్చిందన్నారు. అయినా కూడా ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంతో మొక్కలు పీకేసారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆళ్లపల్లి మండలంలో పాయం పర్యటనలో పీకేసే మొక్కలతో రోడ్డు మీద వేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని పాయం హామీ ఇచ్చారు.

# నూతన 33కెవి ఇంటర్ లింకింగ్, ఇన్అండ్‌ఔట్ కొత్త లైన్ ప్రారంభం



**ప్రజాపక్షం/వైరా:** వైరా అసిస్టెంట్ ఇంజనీరింగ్ కార్యాలయం నందు నూతనంగా నిర్మించిన 33కెవి ఇంటర్ లింకింగ్, ఇన్ అండ్ ఔట్ కొత్త లైన్ చార్జింగ్‌ను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ మాట్లాడుతూ వైరా పట్టణంలోని కరెంటు సమస్యలు విపరీతంగా వస్తున్న సందర్భంగా గతంలో తల్లాడ నుంచి సప్లై తీసుకోవడం జరుగుతుంది. అనేక టెక్నికల్ ఇష్యూలు రావడం వలన కరెంటు అంతరాయం కలుగుతుంది. అంతరాయం కలగకుండా ఇప్పుడు నూతనంగా కుర్నవల్లి, కొణిజర్ల మీదుగా మరో కొత్త చార్జింగ్ లైన్‌లను అనుసంధానం చేసే కరెంటు అంతరాయాన్ని అదిగమించడం గమనించినందుకు ముఖ్యంగా సిబ్బందికి ప్రత్యేకమైన ధన్యవాదాలు. నిరంతరం ప్రజలకు కరెంటు అందించాలని సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుండి నాణ్యమైన విద్యుత్ అందిస్తున్న ప్రజలకు ఎక్కడ విద్యుత్ అసౌకర్యం కలగకుండా నిరంతరం ప్రజలకు కరెంటు అందించాలని సిబ్బందిని కోరుతూ నిరంతరం అందుబాటులో ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డి.శ్రీనివాసరావు, ఏఈ సుందర్‌కుమార్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, బొళ్ళ గంగారావు, పమ్మి అశోక్, బిడికె.రత్నం, మచ్చా బుజ్జి, పాలేటి నర్సింహారావు, దార్న రాజశేఖర్, శీలం చంద్రశేఖర్‌రెడ్డి, వీరంశెట్టి సీతారాములు, నర్వనేని అశోక్, జవ్వాజి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యునిగా కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఐదు రోజుల పాటు పంజాబ్ రాష్ట్రంలోని చండీఘర్‌లో జరిగిన సిపిఐ 25వ జాతీయ మహాసభల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, స్థానిక ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు మరో సారి జాతీయ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తొలిసారిగా జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికయ్యారు. కూనంనేని ఐదు దశాబ్దాలుగా సిపిఐలో కీలకపాత్ర పోషిస్తున్నారు. 2005 నుండి 2009 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2009లో కొత్తగూడెం నియోజకవర్గం నుండి పోటీ చేసి ఎంఎల్ఏగా గెలుపొందారు. తిరిగి 2023లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించి ప్రస్తుత ఎంఎల్ఏ గా కూనంనేని కొనసాగుతున్నారు. ఇదిలా ఉండగా జాతీయ సమితి సభ్యులుగా తొలిసారిగా ఎంపికైన ఎస్‌కే సాబీర్ పాషా విద్యార్థి దశ నుండి కమ్యూనిస్టు పార్టీలో చురుకైన పాత్ర పోషించి యువజన నాయకునిగా, కార్మిక ఉద్యమాల్లో తనదైన భూమిక పోషించారు. 1995లో ఏఐఎస్ఎఫ్ కొత్తగూడెం కార్యదర్శిగా పనిచేస్తూ సిపిఐ సభ్యత్వం తీసుకున్నారు. ఏడేళ్ల పాటు విద్యార్థి విభాగం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శిగా విధులు నిర్వహించారు. 2001లో ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి ఏపి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. పార్టీ అవసరాల నిమిత్తం 2002లో కొత్తగూడెం సిపిఐ పట్టణ కార్యదర్శిగా ఎంపికయ్యారు. 2005 నుండి 2010 వరకు కొత్తగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్‌గా పదవీ బాధ్యలు చేపట్టిన ఆయన 200917 వరకు ఉమ్మడి ఖమ్మం జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శిగా పని చేసిన ఆయన నూతన జిల్లా ఏర్పడిన నాటి నుండి కార్యదర్శిగా కొనసాగుతున్నారు. పాష జాతీయ సమితి సభ్యులుగా ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ చిన్ననాటి నుండి వామపక్ష భావాజాలంతో పెరిగిన తనను పార్టీ గుర్తించిందని, తనపై పెట్టిన పెద్ద బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ పురోభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

# సిపిఐ జాతీయ సమితి సభ్యునిగా బాగం

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ సమితి సభ్యులుగా ఖమ్మంకు చెందిన బాగం హేమంతరావు ఎన్నికయ్యారు. ఛండీఘర్‌లో ఈనెల 21 నుంచి 25 వరకు జరిగిన జాతీయ మహాసభల్లో ఈ ఎన్నిక జరిగింది. బాగం హేమంతరావు నేలకొండపల్లి మండలం మోటాపురం గ్రామం రైతు కుటుంబంలో జన్మించారు. ఏఐఎస్ఎఫ్ నాయకునిగా, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులుగా పనిచేసిన హేమంతరావు భారత కమ్యూనిస్టు పార్టీ ఉమ్మడి ఖమ్మంజిల్లా కార్యదర్శిగా సుదీర్ఘ కాలం పనిచేశారు. డిసిసిబి ఉపాధ్యక్షులుగా పనిచేసిన హేమంతరావు ప్రస్తుతం మోటాపురం పిఎసిఎస్ అధ్యక్షులుగా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులుగా పని చేస్తున్నారు. జాతీయ సమితి సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు, ప్రజా ఉద్యమ నిర్మాణానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శత వసంత ముగింపు సభ ఖమ్మంలో జరగనుందని ఆ ముగింపు సభ జయప్రదంపై దృష్టి సారించనున్నట్లు హేమంతరావు తెలిపారు.

# ఘనంగా బతుకమ్మ వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)



శంకుస్థాపన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మీరు ఎన్నుకున్న ప్రభుత్వం ప్రజలకు అన్ని విధాలుగా సంక్షేమ కార్యక్రమాలను తీర్చుతుందని అందుకు నిదర్శనమే నేడు ఇందిరమ్మ డబుల బెడ్ రూమ్ ఇల్లు, సీసీ రోడ్లు, రైతుబంధు, సన్న బియ్యం, ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు ఇంకా అనేక కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలందరికి అందిస్తూ ఇందిరమ్మరాజ్యాన్ని అంటే ఏమిటో చూపిస్తున్నామని అన్నారు. దానిని ఓర్వలేక కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని గత ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో ఇండ్లు నిర్మించడంలో వైఫల్యం చెంది కమిషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను చేపట్టి కమిషన్లకు కక్కుర్తిపడి ప్రజలను విస్మరించారని అన్నారు. ఈకార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గణితం ఉపాధ్యాయునికి జాతీయ అవార్డు




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం పరిధిలోని పేరువంచ జిల్లా పరిషత్ ఉన్న త పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి మౌలాలి నేషనల్ ఎక్సలెన్స్ టీచర్ అవార్డును గురువారం హైదరాబాద్‌లో అందుకున్నారు. గణితం ఉపాధ్యాయ రంగంలో విశిష్టత ప్రదర్శించి విద్యార్థుల మేధస్సును మెరుగుపరచడమే కాక వారి భవిష్యత్తును సమగ్రంగా తీర్చిదిద్దుతూ విద్యారంగ అభివృద్ధికి కట్టుబడి సృజనాత్మక బోధనా పద్ధతులు, విద్యను సమాజానికి దగ్గర చేస్తూ డిజిటల్ తరగతుల్లో శిక్షణ ఇస్తూ విద్యార్థుల ప్రతిభను వెలుగుతీస్తూ, వారి అభివృద్ధికి సలహాలు, సూచనలు, శిక్షణలు మండల జిల్లా స్థాయిలో అనేక శిక్షణలో మెలకువలు ఇస్తూ అభివృద్ధికి తోడ్పాటును ఇస్తుండటంతో ఆ ఉపాధ్యాయునికి జాతీ య అవార్డును అందజేశారు. ఈ కార్యక్రమంలో కమల, మనోహర్, తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఇటుకల పురుషోత్తం, ఎమ్మెల్సీ మల్కం కొమరయ్య, టాలీవుడ్ నటుడు రఘు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. దీంతో మండల పరిధిలోని పలు ఉపాధ్యా య సంఘాలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజా సంఘాలు, పేరువంచ గ్రామ ప్రజలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మండల ప్రజలు హర్షిస్తూ ధన్యవాదములు తెలిపారు.

# ధరలకు అనుగుణంగా మార్కెట్ విలువ సవరణ

**-అర్హులకు భూ హక్కుల కల్పన**
**-డీలర్లు మాత్రమే రేషన్ షాపులు నడపాలి**
**-అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా మార్కెట్ విలువ సవరణ ప్రతిపాదనలు తయారు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి రెవెన్యూ శాఖలోని పలు అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. భూముల మార్కెట్ విలువ సవరణ, నిషేధిత భూముల జాబితా రిజిస్టర్ (22(ఏ)), భూ భారతి దరఖాస్తుల పరిష్కారం, రేషన్ షాపుల పర్యవేక్షణ, జాతీయ రహదారుల కోసం సేకరించిన భూములను మ్యూటేషన్ చేయడం వంటి పలు అంశాలపై అదనపు కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సర్వే నెంబర్ల వారీగా అధ్యయనం చేసి భూముల విలువ సవరణ ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. పెరిగిన భూముల ధరలకు అనుగుణంగా మార్కెట్ విలువ పకడ్బందీగా నిర్ణయించాలని తెలిపారు. జాతీయ రహదారులకు సంబంధించి సేకరించిన భూముల మ్యూటేషన్ త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం సేకరించిన భూములను ఆయా శాఖల పేరు మీద మ్యూటేషన్ చేయాలని ఆదేశించారు. 22(ఏ) రిజిస్టర్ రూపకల్పనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వ భవనాల వివరాలు డోర్ నెంబర్‌తో సహా వీటిలో నమోదు చేయాలన్నారు. భూ భారతి దరఖాస్తులను వేగంగా పరిష్కరించి అర్హులకు భూ హక్కులు కల్పించాలన్నారు. మండలంలో ఉన్న రేషన్ షాపులను తహసీల్దార్ క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు. రేషన్ షాపులను ప్రభుత్వం ఆథరైజ్ చేసిన డీలర్లు మాత్రమే నడపాలన్నారు. అక్టోబర్ చివరి నాటికి జిల్లాలో ఉన్న అన్ని రేషన్ షాపులను తనిఖీ చేసి నివేదిక అందించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్ రవీందర్‌రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్ కుమార్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, కలెక్టరేట్ ఏవో కె. శ్రీనివాసరావు, సబ్ రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బొమ్మలో బతుకమ్మ సంబురాలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 15వ డివిజన్‌లో గల బొమ్మ విద్యా సంస్థలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం కళాశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలను విద్యా సంస్థల ఛైర్మన్ బొమ్మ రాజేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బతుకమ్మ యొక్క విశిష్టతను వివరించారు. విద్యార్థినిలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ఉదారు శ్రీధర్, వైస్ ఛైర్మన్ బొమ్మ సత్యప్రసాద్, బొమ్మ లక్ష్మి రాజ్యం, బొమ్మ అనూష, ఉదారు మాధవి, ఇంజనీరింగ్, ఫార్మసీ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు వైద్య పరీక్షలు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాల్ ఆఫీసులో మున్సిపల్ వర్కర్స్‌కు హెల్త్‌క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాల్ కార్మికులు అందరికి బిపి, షుగర్, స్కిన్ వ్యాధులు స్క్రీనింగ్ చేసి అవసరం అయినా మందులు ఇచ్చారు. మున్సిపాల్ కార్మికులు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు డాక్టర్ హర్ష వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ కమీషనర్ గురులింగం, సానిటరి ఇన్స్‌పెక్టర్ వీరన్న, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ వెంకట్, పిహెచ్‌సి, పల్లె దవాఖానా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆశా, హెల్త్ సూపర్‌వైజర్లు, అనంతరాములు, ఏనుమని, హెల్త్ అసిస్టెంట్ రవి, ఏఎన్ఎం సరస్వతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ప్రయాణికులకు లక్కీ డ్రా

**-దసరా పండుగకు ప్రత్యేక సర్వీసులు**
**-ఆర్టీసి రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు నగదు బహుమతిని అందించేందుకు ప్రత్యేకంగా లక్కీ డ్రా పథకాన్ని అమలు చేస్తున్నట్లు టిజిఎస్ ఆర్టీసి ఖమ్మం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ తెలిపారు. దసరా పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈనెల 27 నుంచి అక్టోబర్ ఆరు వరకు ఖమ్మం రీజియన్ పరిధిలో ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆర్ఎం తెలిపారు. గురువారం రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ మాట్లాడుతూ లక్కీ డ్రా స్కీంకు ఈనెల 27 నుంచి అక్టోబర్ ఆరు వరకు డీలక్స్, సూపర్ లగ్జరీ, లహరీ ఏసి, నాన్ ఏసి, రాజధాని బస్సులలో ప్రయాణం చేసే ప్రయాణికులు అర్హులని ఆర్ఎం తెలిపారు. ఆయా బస్సుల్లో ప్రయాణం చేసిన ప్రయాణికులు తమ ప్రయాణ అనంతరం టికెట్ వెనక భాగంలో ప్రయాణికుల పేరు, ఫోన్ నెంబర్, అడ్రస్ నమోదు చేసి బస్ స్టేషన్లలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన లక్కీ డ్రా బాక్స్‌లో వేయాలని తెలిపారు. లక్కీ డ్రా అక్టోబర్ ఎనిమిదిన రీజినల్ మేనేజర్ కార్యాలయంలో నిర్వహించి ముగ్గురు విజేతలను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మొదటి బహుమతిగా రూ. 25వేలు, రెండవ బహుమతిగా రూ. 15వేలు, మూడవ బహుమతిగా రూ. 10వేలు నగదు బహుమతి అందించడం జరుగుతుందన్నారు. పండుగ సందర్భంగా ప్రయాణికులు ఆర్టీసి బస్సులను ఎంచుకుని సురక్షితమైన, సుఖవంతమైన ప్రయాణ అనుభూతితో పాటు నగదు బహుమతులను కూడా పొందవచ్చునని ఆయన తెలిపారు. ఇట్టి అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

# పులి నాగేశ్వరరావును పరామర్శించిన సంభాని



**ప్రజాపక్షం/తల్లాడ:** తల్లాడ మండలం రామచంద్రాపురం గ్రామం లో పులి నాగేశ్వరరావుని పరామర్శించిన మాజీ మంత్రివర్యులు సంభాని చంద్రశేఖర్‌రావు, పులి నాగేశ్వరరావు ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న విషయం తెలుసుకున్న చంద్రశేఖర్ రావు, పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి రామచంద్రాపురంలో పులి నాగేశ్వరరావు గృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. సంభాని చంద్రశేఖర్ వెంట రఘుపతి రెడ్డి, తోట రామారావు, సునావత్ వెంకటేశ్వర్లు, పులి రామారావు, కొలిపాక వెంకటేశ్వర్లు, రేగళ్ల రామారావు, సత్తెనపల్లి వెంకటేశ్వర్లు, తూము శ్రీనివాసరావు, పొదిలి వెంకటేశ్వర్లు, పులి వెంకటేశ్వర్లు ఉన్నారు.

# మెజార్టీ స్థానాలను ఏకగ్రీవం చేసుకోవాలి

**-సన్నాహక సమావేశంలో పువ్వాళ్ల దుర్గాప్రసాద్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో మెజార్టీ స్థానాలను ఏకగ్రీవం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో రఘునాథపాలెం మండల కాంగ్రెస్ పార్టీ స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం మండల కన్వీనర్ దీప్లానాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు తుమ్మల యుగంధర్ లు మాట్లాడుతూ రఘునాథపాలెం మండలంలో రాబోయే జెడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో అన్ని స్థానాలు కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మెజార్టీ స్థానాలను ఏకగ్రీవం చేయాలన్నారు. గ్రామాల్లో చిన్నచిన్న సమస్యలు, వర్గపోరు లేకుండా పార్టీ నిర్ణయించిన అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇంచార్జీలకు ప్రతి విషయాన్ని తెలియజేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి గ్రామంలో కమిటీ ఏర్పాటు చేసుకుని ఆ కమిటీ ద్వారా గ్రామంలోని సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.పార్టీలో కష్టపడి పనిచేసే వారిని గుర్తించి సముచిత స్థానాన్ని కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఇంచార్జి నూతి సత్యనారాయణ, మేయర్ పునుకొల్లు నీరజ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, సాధు రమేష్‌రెడ్డి, నాగండ్ల దీపక్‌చౌదరి, బాలగంగాధర్ తిలక్, చోటాబాబా, కార్పొరేటర్లు, మండల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైరా యువతకి డిఎస్‌పి ఉద్యోగం



**ప్రజాపక్షం/వైరా:** వైరాకి చెందిన సంగెపు లక్ష్మీ సాహితి గ్రూప్ వన్ ఫలితాల్లో 129వ ర్యాంకు సాధించి మల్టీజోన్‌లో 69వ ర్యాంకు సాధించింది. గురువారం గ్రూప్ వన్‌లో ర్యాంకులు సాధించిన వారికి పోస్టులు కేటాయింపులో భాగంగా లక్ష్మీ సాహితికి డిఎస్పీ క్యాడర్‌కి నియామకమైంది. ఈ సందర్భంగా ఆమె తల్లిదండ్రులు లక్ష్మీ సాహితితో ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ సాహితి ప్రజాపక్షంతో మాట్లాడుతూ డిఎస్పీ ఉద్యోగానికి ఎంపికకావడం పట్ల చాలా సంతోషంగా ఉంది. నేను ఉద్యోగం సాధించడానికి నా తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు అందించిన స్ఫూర్తి మరువలేనిది అని తెలిపారు.

# సమాధానం మృతి పార్టీకి తీరనిలోటు

**సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏపూరి రవీంద్రబాబు**



**ప్రజాపక్షం/చింతకాని :** సిపిఐ సినియర్ నాయకురాలు అద్దంకి సమాధానం బ్రతికినంతకాలం ఎర్ర జెండా ఎత్తుకొని నిబద్ధత గల కమ్యూనిస్టుగా బ్రతికారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏపూరి రవీంద్రబాబు పేర్కొన్నారు. నాగిలిగొండ గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకురాలు అద్దంకి సమాధానం(60) గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. సిపిఐ చింతకాని మండల కమిటీ నాగిలిగొండ చేరుకుని సమాధానం మృతదేహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ సమాధానం గ్రామంలో చిన్నతనం నుంచి పార్టీ పిలుపిచ్చిన ప్రతి కార్యక్రమంలో ముందుం దేవారని గుర్తు చేసుకున్నారు.సమాధానం కుటుంబానికి పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. నివాళులర్పించిన వారిలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లికార్జునరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, నాయకులు వేముల జానకిరాములు, పదిమల వెంకటనర్సయ్య, శాఖా కార్యదర్శి చాట్ల రమేష్, షేక్ జాన్, ఏపూరి నరసయ్య తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 26వ డివిజన్‌లో మేయర్ పునుకొల్లు నీరజ ఇందిరమ్మ ఇండ్లకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ పథకం ద్వారా ఇండ్లను అందించనున్నట్లు తెలిపారు. మొదటి విడతలో గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన వారికి సంక్షేమ పథకాల అమలుతో పాటు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సహకారంతో కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ రాజు, నాయకులు బుజ్జి, ప్రసాద్, యాకూబ్, మాధవి, సరిత తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కందాళ విస్తృత పర్యటన



ప్రజాపక్షం/నేలకొండపల్లి : పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి గురువారం మండలం లో విస్తృతంగా పర్యటించారు. కోర్లగూడెంలో గత రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మనోజ్, ప్రసాద్ ల కుటుంబాలను పరామర్శించారు. చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గువ్వలగూడెం లో ఇటీవల మృతి చెందిన గొగినేని పుల్లయ్య, నర్సయ్య ల కుటుంబాలను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు ను పరామర్శించారు. ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య, శాఖమూరి సతీష్, మరికంటి రేణుబాబు, కమదన ప్రవీణ్, కొండా కనక ప్రసాద్, కోటారి ప్రసాద్, చావా వంశీ, మాదాసు ఆదాం, బచ్చలకూరి శ్రీనివాస రావు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/ఏన్కూరు : మండల పరిధిలోని తూతకలింగంపేట గ్రామానికి చెందిన చింతనబోయిన కావ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. యువతీ మృతి చెందిన సంఘటన తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య రవాణా శాఖ అధికారి బొర్ర తిరుపతయ్య గురువారం 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఫోన్ ద్వారా కావ్య కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని ఆయన కోరారు. కావ్య కుటుంబ సభ్యులు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, కుటుంబం రోజువారి పనికి వెళ్తేనే కుటుంబం వెళ్లే పరిస్థితి ఉందని ఆయన తెలుసుకొని ఈ సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మల్కం వినోద్, చింతలబోయిన నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

**62 మందికి రూ.20.23 లక్షల చెక్కులు అందజేత**



ప్రజాపక్షం/నేలకొండపల్లి : సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరంలాంటిదని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. మండల కేంద్రం లోని పార్టీ కార్యాలయంలో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 62 మంది కి రూ.20 లక్షల 23 వేల 500 విలువైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం నిరుపేదలకు అండగా నిలుస్తుందని అన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి చొరవతో అనేక మందికి సీఎంఆర్ఎఫ్ ని మంజూరు చేయించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శాఖమూరి రమేష్, నంబూరి రామారావు, గరిడేపల్లి రామారావు, కడియాల నరేష్, కొమ్మినేని విజయబాబు, బాలాజీ, కోటేశ్వరరావు, జైరు లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

## పట్టపగలే చోరీకి యత్నం..!

ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండల కేంద్రంలో పట్టపగలే చోరీకి యత్నించారు. గోడ దూకేందుకు ప్రయత్నించగా...స్థానికులు గమనించి పట్టుకునేందుకు ప్రయత్నించారు. కానీ పరుగులు తీశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండల కేంద్రం కు చెందిన ఓ ఇంటి లో పట్టపగలే చోరీ కి ఇరువురు వ్యక్తులు ప్రయత్నించారు. అది కూడ ప్రధాన సెంటర్ కు కూత వేటు దూరంలోనే జనసంచారమైన ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో కి చోరబడేందుకు గోడ దూకుతున్నారు. ఇది గమనించిన ఇంట్లో ఉన్న వారు.. అరుపులు, కేకలు వేయటంతో స్థానికులు గమనించి సదరు దొంగలను పట్టుకునేందుకు ప్రయత్నించారు. కానీ అక్కడ నుంచి పారిపోయారు. పారిపోతుండగా ప్రధాన సెంటర్ లో రాజేశ్వరపురం కు చెందిన ఓ యువకుడు వద్ద అత్యవసరం అని ఫోన్ తీసుకుని మాట్లాడి పారిపోయారు. ఈ విషయం ను స్థానిక పోలీసులు పసిగట్టి ఫోన్ ఇచ్చిన యువకుడు ను అదుపులోకి తీసుకుని విచారించారు. వివరాలు సేకరించి ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అయితే పట్టపగలే చోరీకి యత్నించారంటే రెక్కి నిర్వహించి చోరీకి యత్నించారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి



ప్రజాపక్షం/చండ్రుగొండ: అంటురోగాలు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అశ్వారావుపేట నియోజక వర్గ సేవా ప్రధాన కార్యదర్శి ఫజల్ బక్ష అన్నారు. గురువారం అశ్వారావుపేట ఎంపిడిఓ జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు స్వచ్ఛత హి సేవ లో భాగంగా మండల పరిధిలోని బెండాలపాడు పంచాయితీ పరిసరాల్లో చెట్లను నరికి శ్రమదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఇండ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా తగు జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాల పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రోహిత్, కాంగ్రెస్ నాయకులు పోరా సురేష్, మల్లం కృష్ణయ్య, అంగన్వాడీ టీచర్స్, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలపై చర్యలు శూన్యం..!

**అధికారుల మౌనం దేనికి సంకేతం..!**



ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి పట్టణ, మండలంలో జరుగుతున్న బహుళ అంతస్తుల నిర్మాణాలలో యజమానులు అనుమతులకు నీళ్ళోదులుతున్నారని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అసైన్డ్ భూములలో సైతం ఎటువంటి అనుమతులు లేకుండానే బహుళ అంతస్తులు నిర్మించుకుంటూ దర్జాగా మిద్దె మీద కడుతున్న అధికారులకు మాత్రం కనిపించకపోవడం శోచనీయమని, పట్టణంలో సరైన అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల శరవేగంగా నిర్మాణం జరుగుతున్నప్పటికి అధికారులు అటువైపు కన్నెత్తి చూడకుండా మౌనంగా ఉండటానికి గల కారణం ఏమిటని ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నివాస గృహాలు, వ్యాపార సముదాయాల నిర్మాణంలో పలు నియమ, నిబంధనలున్నప్పటికి యజమానులు ఆయా నియమ, నిబంధనలను తుంగలో తొక్కి యద్దేచ్ఛగా వారికి నచ్చిన విధంగా నిర్మాణాలు చేపడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సెట్ బ్యాంక్ విడవకుండానే నిర్మాణాలు జరుగుతున్నాయని, ఫైర్ సేఫ్టీని అసలు పట్టించుకోవడంలేదని, పార్కింగ్ సదుపాయం మచ్చుకు కూడా కనిపించడం లేదని, సెల్లార్ లు నిర్మాణం జరుగుతున్నప్పటికీ వాటిని కూడా అద్దెలకిస్తూ వ్యాపార దృక్పథంతో యజమానులు మసులుకుంటున్నారని ప్రజా సంఘాల నాయకులు, నిపుణులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

**నిర్మాణాలలో అక్రమమే...**

మున్సిపల్ స్థాయిలో అనుమతులు తీసుకుంటున్న యజమానులు, అనుమతికి మించి మిద్దె, మీద మీద్దె కడుతూ నిబంధనలకు నీళ్ళోదులుతున్నారని, సరైన అనుమతులు లేకుండా జరుగుతున్న నిర్మాణాలు అక్రమమేనని, నిర్మాణాల కోసం వినియోగిస్తున్న ఇసుక కూడా సక్రమంగా ఉండటం లేద ని, దొడ్డి దారిలో అక్రమ మార్గంలో తరలించిందేనని ప్రజలు చెప్తున్నారు.

**అధికారులు అటువైపు చూడరా...?**

పట్టణంలోని ఓ పేరున్న ఆసుపత్రి వీధిలో గల అసైన్మెంట్ భూమిలో ఓ వ్యక్తి ఎటువంటి అనుమతులు లేకుండానే దర్జాగా బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టాడని, ఆ నిర్మాణం అక్రమంగా జరుగుతున్నప్పటికి అధికారులు ఆ వైపుగా కన్నెత్తి కూడా చూడడం లేదని, ఇదే మాదిరి సత్తుపల్లి పట్టణంలో పలు నివాస గృహాలు, వ్యాపార సముదాయాలు సరైన అనుమతులు లేకుండానే నిర్మాణం చేస్తున్నారని వాటిపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోకుండా మేనమేషాలు లెక్కిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లాడ్జీలు, వస్త్ర దుకాణాలు, పెద్ద, పెద్ద మార్టులలో సెల్లార్లను వాహనాల పార్కింగ్ కు కాకుండా అద్దెలకు ఇచ్చి వ్యాపార దృక్పథంతో చూస్తున్నారే తప్ప ప్రజల ప్రాణాలను పట్టించుకోవడంలేదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సత్తుపల్లి పట్టణంలో జరుగుతున్న నిర్మాణాలలో సరైన అనుమతులు లేని వాటిపై కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో ప్రమాదాలను నివారించవచ్చునని, తక్షణమే అధికారులు ఆ వైపుగా ఆలోచించి సరైన అనుమతులు లేని నిబంధనలకు విరుద్ధంగా ఉన్న భవనాలపై కొరడా జుళిపించాలని ప్రజలు కోరుతున్నారు.

**టౌన్ ప్లానింగ్ అధికారి వివరణ...**

సరైన అనుమతులు లేనిబహుళ అంతస్తుల వివరాలను కోరేందుకు చరవాణిలో సత్తుపల్లి మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారిని సంప్రదించగా, తాను ప్రస్తుతం అందుబాటులో లేనని, తనకు పూర్తి సమాచారం తెలియదని తెలుసుకొని చెప్తానడం ఆశ్చర్యాన్ని కలిగించింది.

# సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా పెంచాలి

**ఐఎఫ్టియు ఆధ్వర్యంలో జిఎం కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా**
**జిఎం దుర్గం రామచందర్ కి వినతిపత్రం అందజేత**



ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు లాభాల బాట 15% చెల్లించాలని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం మణుగూరు జిఎం కార్యాలయం వద్ద కాంటాక్ట్ కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. కాంట్రాక్ట్ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఏరియా జిఎం దుర్గం రామచందర్కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికుల ఉద్దేశించి ఐఎఫ్టియు అనుబంధ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జడ సీతారామయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి లాభాలలో పర్మినెంట్ కార్మికులతో పాటు కాంటాక్ట్ కార్మికుల శ్రమ దాగి ఉందని గత సంవత్సరం తొలిసారిగా ఐదు వేల రూపాయలు ప్రకటించి అమలు చేసిన సంస్థ వాటికి తోడు కేవలం ఈ సంవత్సరం ఐదు వందల రూపాయలు మాత్రమే పెంచి మొత్తంగా ఐదు వేల ఐదు వందల రూపాయలు మాత్రమే ప్రకటించటం కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను గుర్తించకపోవడమేనని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం స్పందించి అన్ని విభాగాల సింగరేణి కాంటాక్ట్ కార్మికులకు ఓబి వర్కర్లకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ప్రైవేటు వాహన డ్రైవర్లకు లాభాలలో 15% ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. కోల్ ఇండియాలో కాంట్రాక్ట్ కార్మికులకు హై పవర్ కమిటీ వేతనాలు అమలు చేస్తుంటే సింగరేణిలో అమలు కాకపోవటం విచారకరమన్నారు. ఒప్పందాలు చేసిన సంఘాలు ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. లాభాలు వాటాలో కాంట్రాక్ట్ కార్మికులకు న్యాయం చేయకుంటే సింగరేణి వ్యాప్తంగా ఆందోళనలు తప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోదావరిలోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు యస్డి నాసర్ పాషా, ఐఎఫ్ టియు మణుగూరు ఏరియా అధ్యక్షులు మిడిదొడ్ల నాగేశ్వరరావు, సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏరియా అధ్యక్షులు అంగోత్ మంగీలాల్, కాంట్రాక్ట్ కార్మికులు వెంకటేశ్వర్లు, ప్రదీప్, నివాస్, దయాకర్, ఐ. ప్రవీణ్, విజయ్, డి. శ్రీకాంత్, సారయ్య, ఇజ్రాయిల్, కరంచంద్, రామారావు, రాజు, పద్మ, పెద ఎల్లమ్మ, నాగమణి, రమాదేవి, చిన్న ఎల్లమ్మ, ఫాతిమా, రమణ, సోని, రమ, సత్యవతి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలి

**-దీనదయాళ్ జీవితం ను ఆదర్శంగా తీసుకోవాలి**
**-బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్**



ప్రజాపక్షం/నేలకొండపల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి వెళ్లి ప్రజలకు ప్రచారం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్ సూచించారు. మండల కేంద్రంలో గురువారం పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జన్మదినం సందర్భంగా స్థానిక రామదాసు ధ్యాన మందిరంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు...పండిట్ దీనదయాళ్ జీవితం నేటి తరం కు ఆదర్శమని అన్నారు. ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. ఆయన మార్గం అనుసరణీయం అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీజేపీని అన్ని స్థానాలలో గెలిపించేందుకు కార్యకర్తలు సైనికులా పని చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం ప్రభుత్వ పథకాలను ప్రజలకువివరిస్తూ ఓటర్ల ను కలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మన్నె కృష్ణారావు, భువనాసి దుర్గారావు, మండల అధ్యక్షుడు పొగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, షేక్ షరుద్దీన్, బాజా రామకృష్ణ, మల్లెబోయిన గోవిందరావు, సయ్యద్ మోహినుద్దీన్, కందరబోయిన గోపి, వెంకటరమణ, కొండా హర్ష, పిట్టల సూరిబాబు, గడ్డం వెంకటేశ్వర్లు, పుట్టా సత్యనారాయణ, నాగరాజు, వీరు నాయక్, మన్నె రాధాకృష్ణ, నరసింహారావు, మల్లిఖార్జున్, కొండలు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛత అందరి బాధ్యత : కలెక్టర్



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : స్వచ్ఛత అనేది ఒక్కరోజుది కాదని, అదీ ప్రతీ ఒక్కరి బాధ్యతని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. పరిశుభ్రతా కార్యక్రమాలు సమాజంలో నిత్యకృత్యంగా కొనసాగితేనే ఆరోగ్య వంతమైన, పరిశుభ్రమైన పచ్చదనంతో కూడిన వాతావరణం ఏర్పడుతుందని ఆయన సూచించారు. భారత ప్రధాని పిలుపులో భాగంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డా.మన్మోహన్ సింగ్ ఎర్త్ యూనివర్సిటీ ఆవరణలో ప్రత్యేక శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా అధికారులు, అధ్యాపకులతో పాటు విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.విశ్వవిద్యాలయం ఆవరణలో గడ్డిని, పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రతను కాపాడే దిశగా శ్రమదానం చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటి నుండి మొదలుకుని సమాజం వరకు అంతా పరిశుభ్రతపై శ్రద్ధ పెట్టాలన్నారు. అనంతరం పరిశుభ్రతపై స్వచ్ఛతకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ నాగలక్ష్మీ , మున్సిపల్ కమీషనర్ సుజాత,మైనింగ్ ఏడి దినేష్, గ్రౌండ్ వాటర్ ఏడి రమేష్, మెప్మా పిడి రాజేష్, జిల్లా ఉద్యోగులు,కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

**భద్రాచలం ఐటిడిఏ ఆవరణలో...**



ఐటిడిఏ ఆవరణలో స్వచ్ఛతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిడిఏ పరిపాలనాధికారి సున్నం రాంబాబు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అంతా భాగస్వాములు కావాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటడం ద్వారా ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని చెప్పారు. ఈ సందర్భంగా ఐటిడిఏ కార్యాలయం ఆవరణ మొత్తం పిచ్చిమొక్కలు, గడ్డి, చెత్తా చెదారాన్ని శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో గురుకులం ఆర్సిఓ అరుణ కుమారి, ఎస్ఓ ఉదయ్ భాస్కర్, ఉధ్యానాధికారి ఉదయ్ కుమార్, టిపి శ్రీనివాస్, డిఏస్ఓ ప్రభాకర్రావు, మేనేజర్ ఆదిన్నారాయణ, జేడిఎం హరికృష్ణ, ఐటిడిఏ విభాగంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అందరికీ విద్య, ఉపాధిపై ఉద్యమిద్దాం

**- మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేద్దాం**
**- భగత్సింగ్ జయంతోత్సవాలు ఘనంగా నిర్వహించుకుందాం**
**- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు**



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : అందరికీ విద్యాఉపాధే లక్ష్యంగా ఈ నెల 27,28 తేదీల్లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా భగత్సింగ్ జయంతోత్సవాలను జయప్రదం చేద్దామని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు ఎస్కే షాహీద్, వరక అజిత్ అన్నారు. దేశ స్వతంత్రం కోసం 23 ఏళ్లకే తన ప్రాణాలను అర్పించిన స్వాతంత్ర కాంక్షను విద్యార్థులు, యువకుల్లో రగిలించిన షాహీద్ భగత్సింగ్ జయంతి సందర్భంగా ఆయన ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఘనంగా నిర్వహించాలన్నారు. దేశంలో మతోన్మాదం పెరిగిపోతున్న తరుణంలో స్వాతంత్ర ఫలాలు అనుభవించే వారే లేకుండా పోయారని, భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు,యువకులు భగత్ సింగ్ ఆశాయాల సాధన కోసం పోరాడాలని, బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా తన ప్రాణాలు అర్పించిన గొప్ప అధ్యానవేత్త, విప్లవకారుడు భగత్సింగ్ అన్నారు. భగత్ సింగ్ జయంతిని అధికారికంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాలని, భగత్సింగ్ జీవితచరిత్ర పాఠ్యపుస్తకాల్లో ముద్రించి ఆయన త్యాగాలు విద్యార్థులకు తెలిసే విధంగా చేయలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుండాల సూజన్, , ఇనపెల్లి పవన్ సాయి వినయ్, జిల్లా ఉపాధ్యక్షులు సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

# బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన కార్మిక సంఘం టిబిజికెయస్

**ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి**



ప్రజాపక్షం/మణుగూరు: బదిలీ కార్మికుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన కార్మిక సంఘం టిబిజికెయస్ అని ఏరియా టిబిజికెయస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థ ప్రగతి కోసం కష్టించి పనిచేసే యువ కార్మికుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడం కోసం సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం తీసుకున్న నిర్ణయం మేరకు సింగరేణి వ్యాప్తంగా భూగర్భ, ఉపరితల విభాగాల్లో పని చేస్తున్న 1258 యువ బదిలీ కార్మికులను సెప్టెంబర్ 01 వ తేదీ నుంచి జనరల్ అసిస్టెంట్ లుగా పరిగణిస్తూ సింగరేణి యాజమాన్యం ఉత్తర్వులు విడుదల చేయడం అందులో మణుగూరు ఏరియా కొండాపురం భూగర్భ గని కి చెందిన 19 మంది యువ కార్మికులకు అవకాశం లభించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఇటీవల లాభాల వాటా పై ప్రకటన, సింగరేణిలో నెలకొని ఉన్న తదితర కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ టిబిజికెయస్ గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్, సారథ్యంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాపు కృష్ణ నేతృత్వంలో హైద్రాబాద్ సింగరేణి భవన్ ముందు పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించి సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం కు కార్మిక పక్షాన నిలిచి వినతి పత్రం ఇవ్వడం టిబిజికెయస్ చేసిన ఒత్తిడి, ప్రతిపాదన మేరకు లాభాల వాటా ప్రకటన, ముందస్తు దసరా పండుగ అడ్వాన్స్ చెల్లింపు, బదిలీ కార్మికులను జనరల్ అసిస్టెంట్లుగా పరిగణిస్తూ ఉత్తర్వుల జారీ ఒక్కొకటిగా యాజమాన్యం కార్మికులకు మేలు చేసే ప్రకటనలు విడుదల చేయడం సంతోషకరమైన అంశం అని తెలిపారు. కొత్తగా కొలువులో చేరిన బదిలీ కార్మికులు ఏడాది లోపు అండర్ గ్రౌండ్ లో 190 హాజర్లు ఉపరితల విభాగంలో 240 హాజర్లు పూర్తి చేసి ఉంటే వారికి జనరల్ అసిస్టెంట్ పదోన్నతులు ఇచ్చే ప్రయోజనాన్ని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గుర్తింపు కార్మిక సంఘంగా ఉన్న హయాంలోనే ప్రవేశపెట్టి సింగరేణి చరిత్రలో లేని సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టడం జరిగిందని నాడు టిబిజికెయస్ చేసిన మేలు నేడు వేలాది మంది బదిలీ కార్మికుల బంగారు భవిష్యత్తుకు పునాదులుగా నిలుస్తున్నాయని తెలిపారు. సమైక్య పాలనలో ఆనాడు సింగరేణి సంస్థలో ఇప్పుడు ఉన్న గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలే పాలన చేశాయని బదిలీ పిల్లర్ నుంచి బదిలీ వర్కర్ గా రావడానికి సుమారు 7 ఏళ్లకు పైగా పట్టేదని బదిలీ కార్మికుడి నుంచి జనరల్ అసిస్టెంట్ గా రావడానికి మరో 10 ఏళ్లకు పైగా పట్టిన దాఖలు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ పాలన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గుర్తింపు కార్మిక సంఘం గా సింగరేణిలో ఎన్నిక అనంతరం యువ బదిలీ కార్మిక మేలు కోరి సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. ఏడాది లోపు నిర్దేశించిన హాజర్లు పూర్తి చేసిన బదిలీ కార్మికులకు జూన్ లోపే ప్రతి ఏటా జనరల్ అసిస్టెంట్ పదోన్నతులు అందించి వేలాది యువ కార్మికుల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడం జరిగిందని తెలిపారు. బదిలీ కార్మికుల నుంచి జనరల్ అసిస్టెంట్ పదోన్నతులు పొందిన ప్రతి ఒక్కరికి మణుగూరు ఏరియా టిబిజికెయస్ తరుపున హృదయ పూర్వక శుభాకాంక్షలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, సెంట్రల్ కమిటి సభ్యులు మునిగేల నాగేశ్వరరావు, మస్తాన్, రామాచారి, రాజ్ కుమార్, ముకేశ్ కుమార్, సుద్దాల సంపత్, మురళీ కృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలంలోని వివిధ గ్రామాలలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం గౌరిదేవి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఉత్సవ కమిటి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాయగూడెం గ్రామంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా ఉపాధ్యాక్షుడు బోయిన వేణు దంపతులు పూజలో పాల్గొన్నారు. కమిటి సభ్యులు వెన్నబోయిన కృష్ణారావు, నంబూరి రమేష్, వడ్డెబోయిన నాగబాబు, ముద్రబోయిన నాగబ్రహ్మం, కాళంగి అశోక్, గోగుల వెంకటేష్, కోసూరి ఉపేందర్, లింగం మహేష్, బోయిన కిరణ్, బోయిన నాగరాణి, కోసూరి అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పనిముట్ల పంపిణీ



ప్రజాపక్షం/గుండాల : వాటర్ షెడ్ పథకం ద్వార వ్యసాయ పనిముట్లతో పాటు , ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పట్టాలను పినపాక నియోజక వర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు లబ్ది దారులకు అందచేశారు. గురువారం మండల పరిదిలో ని పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాయం మాట్లాడుతూ సారవంతమైన భూములు లేక వర్షాదార పంటలపై రైతులు ఆదారపడుతున్నారని , వాటర్ షెడ్ పథకం ద్వార 75 శాతం రాయితీతో వ్యవసాయ పనిముట్లను అందించడం రైతులకు ఎంతో సహకారం అందించడం హర్షించ తగ్గ విషయమన్నారు. అలాగే ఉపాది హామి కూలీలకు పనిముట్లు , కళ్యాణ లక్ష్మి చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కార్యాల యంలో నమోన ఇందిరమ్మ ఇంటిని ప్రారంబిచి, బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు కాశీం, ఎంపిడిఓ బాలరాజు,వివిద శాకల అధికారులు పార్టి నాయకులు ముత్యం చారి, ఎస్కె ఖదీర్, బుచ్చయ్య, దార అశోక్, పి ముత్తయ్య, చాట్ల పద్మ, ఎం శంకర్, బొబ్బిలి పవన్, పల్లపు రాజేష్, పాయం గనేష్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిస్ఫూర్తిలో గెస్ట్ లెక్చరర్ తరగతులు



ప్రజాపక్షం/సత్తుపల్లి: గంగారంలో గల సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ తరగతులు ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) రెండు, మూడవ సంవత్సరం విద్యార్థులకు కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్(ఈఈఈ) విభాగాధిపతి కోటా రామకృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులకు 132/33 కెవి సబ్ స్టేషన్ నుంచి అసిస్టెంట్ ఇంజనీర్ తెలంగాణ ట్రాన్స్ కో వై.విజయ్ చరణ్ సబ్ స్టేషన్ గురించి కూలంకుషంగా వివరించారు. సబ్ స్టేషన్ యొక్క నిర్మాణం, నిర్వహణ, పరికరాలు, డిస్ట్రిబ్యూషన్, మెయింటెనెన్స్ మొదలగు అనేక అంశాలపై విద్యార్థినీ, విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, కళాశాల ప్రిన్స్ పాల్ డా.వూటుకూరి శేషారత్నకుమారి, కోట రామకృష్ణప్రసాద్ లు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు.

## జిల్లా గ్రంథాలయంలో బతుకమ్మ సంబురాలు



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : స్థానిక జిల్లా గ్రంథాలయంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా జరిగాయి. సిద్ధార్థ కాలేజీ, జూనియర్ కాలేజీ విద్యార్థినీలు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమానికి మరింత వన్నెతెచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు ఆట పాటలతో గౌరమ్మను పూజించి దీవెనలు పొందారు. ఈ బతుకమ్మ సంబరాలను గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు ఆధ్వర్యంలో వైభవంగా జరిగాయి. పూలతో దేవుని కొలవడం పరిపాటి కానీ పూలనే దేవతగా పూజించడం బతుకమ్మ ప్రత్యేకత అన్నారు. ఇది ప్రకృతికి సంబంధించిన పండుగ కావడంతో అంతా జరుపుకోవాలన్నారు. రామచంద్ర డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.పద్మ, గ్రంధాలయ కార్యదర్శి కరుణకుమారి, గ్రంథపాలకురాలు గుమ్మడి మణి మృదుల, వైఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి జర్పుల ఉపేందర్, అడ్వకేట్ ఉషారాణి, శాఖ గ్రంథపాలకులు బి వాణి, గీత, ఈశ్వరి, మోదుగుల జోగారావు, లక్ష్మీ దేవిపల్లి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఈశ్వర్ పాల్గొన్నారు.

## రామాలయానికి రూ 5లక్షల విరాళం



ప్రజాపక్షం/కూసుమంచి: మండల కేంద్రం లో నిర్మాణంలో ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ 5లక్షల విరాళం అందజేశారు. గురువారం ఉదయం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో కమిటీ సభ్యులకు ఆయన విరాళం అందజేశారు. కమిటీ సభ్యులు ఈ విరాళానికి కృతజ్ఞతలు తెలిపారు. సీతారామచంద్రుల దీవెనలు ఎల్లప్పుడూ మంత్రి శ్రీనివాస్రెడ్డిపై ఉండాలని వారు కోరుకున్నారు. ఈకార్యక్రమంలో గ్రామపెద్దలు పాల్గొన్నారు.

# పొలాల్లోకి దారేది..?

-రైతుల ఆవేదన
-రైతులతో మాట్లాడిన మంత్రి పొంగులేటి

**ప్రజాపక్షం/పెనుబల్లి:** గ్రీన్ ఫీల్డ్ హైవేకి భూములు ఇచ్చిన రైతులు హైవే నిర్మాణ పనుల వల్ల తమ పొలాల్లోకి వెళ్లే దారులు మూసుకుపోయాయని చిన్న చిన్న బ్రిడ్జిలు కట్టడం ద్వారా పొలం పనులకు ఉపయోగించే యంత్ర పరికరాలు వెళ్లేందుకు రోడ్డు లేక ఇబ్బందికి గురవుతున్నామని రైతులు ఇటీవల నిరసన ధర్నా చేపట్టారు. అధికారుల, ప్రభుత్వానికి తమ సమస్యలను ఎమ్మెల్యే, మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. రైతుల సమస్య పరిష్కరించేందుకు బుధవారం రెవిన్యూ గృహ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి నివాసరెడ్డి కుప్పెనకుంట్లలోని హైవే వద్ద రైతులతో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 99 శాతం అయినా వంద శాతం పనులు అయిపోయిందని పేపర్లో చూపించినది మాత్రం ఏదీ కాదని రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల సమస్యలు పరిష్కారం తర్వాతే కంప్లేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని లేనిచో అందరూ ఇబ్బంది పడతారని హెచ్చరించారు. గ్రీన్ ఫీల్డ్ అంటేనే పచ్చని పొలాల మధ్య వెళ్లే రహదారి అని అన్నారు. ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూములు ఇచ్చిన ఇబ్బందులకు పెట్టొద్దని సూచించారు. రైతు పొలం మధ్యలో వెళ్లిన గ్రీన్ ఫీల్డ్ హైవే కి అటు ఇటు మిగిలిన పొలాలు ముంపుకు గురికాకుండా పొలాలు మెరకలు సరిచేసి సహజ సిద్ధంగా నీరు అందేటట్లు ఏర్పాటు చేయాలని వర్షాకాలంలో ఐదు కిలోమీటర్ల పరిధిలో ఒక అధికారిని నియమించి పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి ఇబ్బంది కలగకుండా హైవే అథారిటీ చూసుకోవాలని అన్నారు. రైతన్నలు కోరుకునేది అత్యాశ కాదని మంత్రి పొంగులేటి అభిప్రాయపడ్డారు. పొలాలకు



వెళ్లే మామూలు దారి అడుగుతున్నారని ఇబ్బంది పెట్టొద్దని అన్నారు. నిర్మాణ పనుల్లో వైరా సత్తుపల్లి నియోజకవర్గాల్లో అనేక రోడ్లు దెబ్బతిన్నాయని వాటిని పరమత్తులు చేపట్టాలని హైవే అధికారులను ఆదేశించారు. రోడ్డు ఒక పక్క 10 కుంటల లోపు మిగిలిన భూమిని రైతులు వద్దంటే ప్రభుత్వం పాత ధర చెల్లిస్తుందని తెలిపారు. వర్షాకాలంలో నీటి ప్ర వాహానికి ఎదురయ్యే సమస్యలను అధికారులు ముందుగానే గుర్తించి భవిష్యత్తులో సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వపరంగా హైవే పై అధికారులతో మాట్లాడి రైతుల సమస్యలను పూర్తిగా పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, వైరా శాసనసభ్యులు రాందాసు నాయక్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, పిఆర్ ఎస్ ఈ జీ. వెంకటరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# కళాశాలకు వసతిగృహం మంజూరు : పొంగులేటి





**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వసతి గృహం మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. కల్లూరులో గురువారం ఆయన పలు అభివృద్ధి పనులకు ప్రారంభో త్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మున్సిపాలిటీలోని మైనారిటీ సంక్షేమ శాఖచే రూ. 75 లక్షలతో నిర్మించిన షాదీ ఖానా భవనాన్ని ప్రారంభించారు. అనంతరం కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు, రాత పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని విద్యార్థులకు పంపిణీ చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద లైబ్రరీ మరి రీడింగ్ హాల్ కు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన సభలో మాట్లాడుతూ స్వగ్రామం నారాయణపురంలో తాను జన్మించి ఇదే కళాశాలలో విద్యార్థిగా చదువుకొని తన తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు ఇంటర్లో చదివేందుకు మూడు కిలోమీటర్ల మేర సైకిల్ పై ప్రయాణం చేసే ఇంటర్ పూర్తి చేయడం జరిగిందని గతంతో పోలిస్తే నేడు విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని 90% వ్యవసాయానికి అనుకూలంగా ఉన్న అనుబంధంగా ఉన్న విద్యార్థులు ఉన్నారని తల్లిదండ్రుల తాపత్రయం కష్టం పిల్లలు అర్థం చేసుకుంటే జీవితంలో రాణించే ఆస్కారం ఉందని అన్నారు కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో కీలకమైలురాయిగా కళాశాల విద్య నిలుస్తుందని ఇంటర్లో బాగా చదివితే ఇంజనీరింగ్ మెడికల్ ఇతర వృత్తి నైపుణ్య కళాశాలలో సీటు లభిస్తుందని దీనివలన విద్యార్థికి మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు అనంతరం మార్కెట్ యార్డులో బతుకమ్మ వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, పి ఆర్ ఎస్ ఈ వెంకట్ రెడ్డి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మహమ్మద్ ముజాహిద్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాగా నీరజా దేవి, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తహశీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, ఐసిడిఎస్ అధికారిని నిర్మల జ్యోతి, ఐకెపి ఎపిఎం అశోక్ రాణి, ఏవో రూపా, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు తో పాటు ఐకెపి వివో ఏలు, మెప్మా రిసోర్స్ పర్సన్ లు అంగన్వాడి ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వైరాలో వ్యవసాయ సదస్సు

పాల్గొన్న ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు

**ప్రజాపక్షం/వైరా:** ఆధునిక సాగు పద్ధతులపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఖమ్మం జిల్లా వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని ఫ్యాక్ట్ కేంద్ర ప్రభుత్వ రంగ ఎరువుల సంస్థ రైతులకు ఒక వ్యవసాయ సదస్సును విజయవంతంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి 120 మంది కి పైగా రైతులు హాజరయ్యారు. సదస్సులో శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొని రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, అధిక దిగుబడులు, ఆరోగ్యకరమైన ఆహారం గురించి వివరించారు.

### సదస్సులోని ముఖ్యాంశాలు...

అశ్వారావుపేట వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్, డాక్టర్ హేమంత్‌కుమార్ మాట్లాడుతూ పత్తి సాగులో అధిక సాంద్రత పద్ధతి వలన కలిగే ప్రయోనాలను వివరించారు. ఈ పద్ధతిలో యంత్రాలను ఉపయోగించడం వలన కూలి ఖర్చు తగ్గి దిగుబడి పెరుగుతుందని తెలిపారు. పంటల మార్పిడి, పప్పు ధాన్యాల ప్రాముఖ్యత: మధిర వ్యవసాయ పరిశోధన కేంద్రం(ఏఆర్ఎస్) ప్రిన్సిపాల్ సైంటిస్ట్, హెడ్, డాక్టర్ రుక్మిణి దేవి మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని కాపాడటానికి పంటల మార్పిడి ఎంత ముఖ్యమో తెలియజేశారు. అలాగే పప్పు ధాన్యాలు, నూనె



గింజల సాగుతో నేల సారం పెరుగుతుందని తెలిపారు.ఫ్యాక్ట్ సేవలు: ఫ్యాక్ట్ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ సురేష్ కుమార్‌రెడ్డి, ఫ్యాక్ట్ కంపెనీ దాని ఉత్పత్తుల, రైతులకు అందిస్తున్న సేవల గురించి వివరించారు.సమతుల్య ఎరువుల వాడకం: ఫ్యాక్ట్ సంస్థ అడిషనల్ జనరల్ మేనేజర్, రామ్మోహన్‌రావు మాట్లాడుతూ సమతుల్య ఎరువుల వాడకం ఆవశ్యకతను నొక్కి చెప్పారు. అంతేకాకుండా పిఎం ప్రణామ్ పథకం, భూసార సంరక్షణ గురించి రైతులకు అవగాహన కల్పించారు.

# గ్రీన్‌ఫీల్డ్ హైవేను పరిశీలించిన పొంగులేటి





**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం స్టేజిపినపాక వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేతో పాటు సర్వీస్ రోడ్డుని పరిశీలించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్టేజిపినపాక నుండి కెజి సిరిపురం వరకు గల రెండు కిలోమీటర్ల మేర గుంటలు పడ్డ రోడ్డు రిపేర్ చేయాలని గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులకు సూచించిన పొంగులేటి ఖమ్మం నుండి వేంసూరు వరకు రైతులకు ఇబ్బంది లేకుండా ఇరువైపులా సర్వీస్ రోడ్డు మంజూరు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, ఖమ్మం టు దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్రాజెక్ట్ డైరెక్టర్ దివ్య, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, కాంగ్రేస్ పార్టీ మండల కాంగ్రేస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, నాయకులు మచ్చా బుజ్జి, కూరాకుల ప్రసాద్, మొక్కా గోపాలకృష్ణ, నాగు, తెల్లూరి వీరయ్య, కూరాకుల రాంబడాబు, సుల్తాన్ శ్రీను, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, తడికమళ్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో జీవిత ఖైదు

**ప్రజాపక్షం/ ఖమ్మం లీగల్ :** హత్య కేసులో ఖమ్మం రెండవ అదనపు జిల్లా న్యాయాధికారి అపర్ణ జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. పర్వతం వెంకన్న మేకల దొంగతనానికి వచ్చి మేకల యజమాని గొంతు కోసి పారిపోయాడని 2022వ సంవత్సరం ఫిబ్రవరి 25న ఖమ్మం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున పిపి ఎ. శంకర్ వాదించగా శ్రీకాంత్, హోంగార్డ్ యూసుఫ్ సహకరించారు.

# సునందకు కీర్తి పురస్కారం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ప్రముఖ రచయిత్రి పూరిమళ్ల సునంద తెలుగు యూనివర్సిటీ ప్రకటించిన కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో ఆచార్య వెలుదండ నిత్యానందరావు అధ్యక్షతన పురస్కారాల ప్రధానోత్సవ సభ జరిగింది. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య హన్మంతరావు, పర్యావరణ ప్రాంతీయ అధ్యయన కేంద్రం పూర్వ సంచాలకులు ఎస్. భూపతిరావు తదితరుల చేతుల మీదుగా సునంద కీర్తి పురస్కారాన్ని అందుకున్నారు. సునంద ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు అందుకున్న విషయం విధితమే.

# పులిపాటికి మరో పురస్కారం



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పురస్కారాల పులిపాటికి మరో పురస్కారం దక్కింది. సామాజిక సేవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే పులిపాటి ప్రసాద్‌కు ప్రముఖ ఛానెల్ జీ తెలుగు అచీవర్స్ అవార్డును ప్రధానం చేసింది. పులిపాటికి జీ తెలుగు అచీవర్స్ అవార్డు దక్కడం పట్ల పలువురు అభినందనలు తెలియజేశారు. ప్రధానోత్సవ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎంపి ఈటల రాజేందర్, మాజీ మంత్రి కేటిఆర్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పులిపాటికి అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. వివిధ సంఘాలు, సంస్థలు, రాజకీయ పార్టీల నేతలు హర్షం వ్యక్తం చేసిన వారిలో ఉన్నారు.

# పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల అర్బన్ బిజెపి అధ్యక్షులు మను బోలు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన పండిట్ దీన్ దయాల్ జయంతి అంత్యోదయ ఏకాత్మ మానవ వాదము ప్రవచించిన ఋషి, భారతీయ జనసంఘ్‌ను ఆదర్శవంతమైన రాజకీయ పార్టీగా రూపొందించిన సంఘ సంస్కర్త, అర్ధశాస్త్రవేత్త, రాజకీయ నాయకులు, భారతీయ జనతా పార్టీ పార్టీకి పుట్టిన పునాదులు వేసిన సమర్థ నాయకులు, నమ్మిన సిద్ధాంతం కోసం తన సర్వాస్వాన్ని త్యాగం చేసిన ఆధునిక దదీచి మహర్షి పండిట్ దీన్ దయాల్ ఉపధ్యాయ జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దుద్దుకూరి కార్తీక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతనిప్పు రామారావు, ప్రధాన కార్యదర్శులు పల్లపాటి వెంకటేష్, వల్లపు అనిల్‌కుమార్, వశిష్ట సింగ్, వాంకుడోత్ శ్రీను, రంగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతుల నిరసన

**-అధికారుల లిఖితపూర్వక హామీతో శాంతించిన రైతులు**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలంలో యూరియా ఎరువుల కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈక్రమంలో మండల పరిధిలోని నాగినేనిప్రోలురెడ్డిపాలెం గ్రామంలో గురువారం ప్రభుత్వం యూరియా లారీని గ్రామానికి పంపించారు. లారీలో ఉన్న కొంత యూరియా బస్తాలను పంచాయితీ కార్యాలయంలోని సొసైటీ కార్యాలయంలో దించారు. మిగిలిన యూరియా బస్తాలను మణుగూరు పంపించేందుకు సిద్ధపడుతున్న సమయంలో యూరియా అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పంటలకు కీలకమైన ఈ సమయంలో యూరియా లేకపోవడంతో, ఎన్ని సార్లు కార్యాలయాల చుట్టూ తిరిగిన తమకు ఇంత వరకు యూరియా సరిగ్గా అందించలేదని ఆగ్రహించిన రైతులు ఏకంగా ఎరువుల లారీని అడ్డుకున్నారు. తమ పంటలు దెబ్బతింటాయని ఆందోళన చెందిన రైతులు, చివరికి తమ నిరసనను వినూత్నంగా తెలియజేశారు. ఎరువులను తరలిస్తున్న ఓ లారీని ఆపి, లారీని అక్కడే బంధించారు. యూరియా అందే వరకు లారీని కదలనిచ్చేది లేదని లారీ ముందు నిరసన వ్యక్తం చేశారు. సుమారు నాలుగు గంటల పాటు లారీని నిలిపివేశారు. ఇదే సమయంలో నియోజకవర్గ ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు దృష్టికి చరవాణి ద్వారా గ్రామస్తులు తెలిపారు. సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రాథమిక సహకార సంఘంచ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ శంకర్, సీఈవో ప్రసాదులు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల్లో యూరియా పంపిస్తామని తెలపడంతో బూర్గంపాడు ప్రాథమిక సహకార సంఘం సీఈవో ప్రసాద్ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు గ్రామంలోని సొసైటీ కార్యాలయం వద్దకు వచ్చి రైతులతో మాట్లాడారు. యూరియా కొరత నిజమేనని అంగీకరించి, తక్షణమే యూరియా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు. అలాగే ఏ ఒక్కరికీ కొరత లేకుండా చూస్తామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి రైతుకూ యూరియా సకాలంలో అందేలా చూస్తామని, లిఖిత పూర్వకంగా హామీతో రైతులు శాంతించారు. అడ్డుకున్న లారీని వదిలిపెట్టి ఆందోళన విరమించారు. మొత్తంగా యూరియా కొరతతో విసిగిపోయి రైతులు చేసిన నిరసన అధికారుల స్పందనతో తాత్కాలికంగా ముగిసింది. అయితే మళ్లీ ఇలాంటి పరిస్థితి పురావృతం కాకుండా చూడాలని రైతులు కోరారు.

# ఇంటూరి భద్రమ్మకు నివాళి





**ప్రజాపక్షం/కూసుమంచి:** మండల పరిధిలోని గోపాలరావుపేటలో జరిగిన జిల్లా బిఆర్ఎస్ పార్టీ నాయకులు , మాజీ డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్ మాతృమూర్తి భద్రమ్మ దశ దిన కర్మకు గురువారం బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంఎల్‌సి తాతా మధు, మాజీ ఎంఎల్‌ఏలు కందాల ఉపేందర్‌రెడ్డి, చంద్రావతిలు హాజరయ్యారు. ఈసందర్భంగా భద్రమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శేఖర్ కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. ఈకార్యక్రమంలో మాజీ డీసీసీబీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆర్జెసి కృష్ణ, బానోతు మంజుల, బిఆర్ఎస్ నాయకులు పగడాల నాగరాజు, బి రెడ్డి నాగచంద్రారెడ్డి, మల్లిడి వెంకటేశ్వర్లు. బెల్లం వేణుగోపాల్, ఉన్నం బ్రహ్మయ్య, వర ప్రసాద్, బాషబోయిన వీరన్న, ఆసిఫ్ పాషా, మరికంటి రేణుబాబు, గొడ్డేటి మాధవరావు, జర్పుల బాలాజీ, బానోతు కిషన్ నాయక్, బజ్జూరి రామిరెడ్డి, మోహన్, కాసాని సైదులు, పడిశాల గోపి, ఉడుగు వెంకటేశ్వర్లు, దాసరి వెంకన్న, బాలకృష్ణ, కొండ సత్యం, కిరణ్‌రెడ్డి, రేగళ్ల కృష్ణ ప్రసాద్, సోషల్ మీడియా బాలకృష్ణ, ఆర్మీ రవి, మాదాసు ఆదాంతో పాటు బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు హాజరై భద్రమ్మకు ఘన నివాళులర్పించారు.

# అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలు

**-పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు**





**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** తెలంగాణ ప్రజా ప్రభుత్వంలే అర్హులకే ఇందిరమ్మ ఇల్లు, సంక్షేమ పథకాలు కేటాయించడం జరుగుతుందని పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మండల పరిధిలోని గత రైతు వేదిక నందు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పథకం ప్రతి పేదవాడి సొంది ఇంటి కల అయినటువంటి ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ, కళ్యాణీ 19 చెక్కులను ఆయన మీదుగా అందించారు. అనంతరం ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనిముట్లు, సీఎంఆర్ఎఫ్ ద్వారా 2,46,500రూపాయల విలువ గల చెక్కులను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఉపాధి పథకం కూలీలకు గడ్డపార, పార, తట్టలను అందించాల్సి ఉందని కానీ అందించలేదని, మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే కూలీలకు అందించామని తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులకు ఇంకా అందని వారు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అర్హులైన వారికి దశగా వారీగా ఇందిరమ్మ ఇల్లు రాజకీయాల కతీతంగా నిరుపేదలకు మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని తెలిపారు. ఇప్పటికే ప్రజా ప్రభుత్వంలో ఉచిత విద్యుత్, ఉచిత గ్యాస్, రైతు రుణమాఫీ, మహిళలకు వడ్డీలేని రుణాలు, మహిళలకు ఉచిత బస్ అందించామని గుర్తు చేశారు. మండలంలో ఇంకా అర్హులైన సంక్షేమ పథకాలు అందని వారు నేరుగా తనను కలవాలని దళారుల మాటలు నమ్మొద్దని వారికి డబ్బులు ఇవ్వద్దని మరోసారి పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అందుకున్న లబ్దిదారుల ముఖాలలో ఆనందం చూస్తుంటే చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు ఉపయోగపడే పని చేస్తే వారి నుండి వచ్చే స్పందన అద్భుతంగా ఉంటుందని అన్నారు. 2006వ సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కేంద్ర ప్రభుత్వంలో ప్రధాని మన్మోహర్ సింగ్ ప్రవేశపెట్టారని, అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా వ్యవసాయ పనులు లేని రోజుల్లో పేదలని ఆదుకునే విధంగా పని కోసం వలసలు వెళ్లకుండా నివసిస్తున్న గ్రామంలోనే ఉపాధి దొరికే విధంగా, గ్రామ అభివృద్ధి పనులను ప్రోత్సహిస్తూ ఈ పథకాన్ని ప్రవేశపెట్టి పేదల ఆకలి తీర్చింది ఇందిరమ్మ ప్రభుత్వమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనూష, ఎంపీడీవో డి శ్రీను, ఏవో అనిల్‌కుమార్, సీడీపీవో తార, మెడికల్ ఆఫీసర్ సంఘమిత్ర, ఏపీవో రఘునాథ్, డీఈఈ (ఆర్‌డబ్ల్యూఎస్) పద్మావతి, ఏఈ(ఆర్‌డబ్ల్యూఎస్) సతీష్, ఏఈ మిషన్ భగీరథ సాయికుమార్, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామ నరసయ్య, మాజీ ఎంపీపీ పెండకట్ల పాపారావు, మండల నాయకులు పడిగ సమ్మయ్య, వాసం శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాసం శ్రీనాథ్, మల్లోజు భరత్, గొగ్గల కాంత్, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై దృష్టి సారించండి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ఎంఎల్ఏ గారు అధ్వానంగా మారిన రోడ్లపై దృష్టి సారించాలని బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకురాలు వగ్గెల పూజిత కోరారు. గురువారం చంద్రు గొండ నుండి గుర్రాయిగూడెం గ్రామానికి వెళ్లే మార్గ మధ్యలో రైల్వే అండర్ బ్రిడ్జి కింద నీటి నిల్వను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ బ్రిడ్జి కింద నుండి అనునిత్యం రైతులు, పాదచారులు తదితరులు వందలాది మంది ప్రయాణిస్తూ ఉంటారని తెలిపారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. గుంటలు మయంగా మారి వాహనాలకు రాకపోకలకు అంతరాయం కలుగుతున్న పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రోడ్లు దుస్థితి అధ్వానంగా మారిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు మొద్దు నిద్ర వీడి రోడ్లను బాగుచేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు భూపతి రమేష్, సత్తి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారికి శిక్షలు పడేలా చూడాలి : ఎస్‌పి



**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా పెంచి, దోషులకు శిక్ష పడేలా చూడాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. జిల్లాలోని అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయాలన్నారు. అంతరాష్ట్ర ముఠా దొంగల పై నిఘా పెంచి దొంగతనాల కట్టడికి కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రమాదహెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, కేసుల పరిష్కార విషయంలో కీలకంగా ఉపయోగపడే సిసి కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమని, ప్రజలు కూడా వారి ఇళ్ల పరిసరాల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ నేరగాళ్లు చేస్తున్న నేరాలపై నిఘా పెంచి అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎస్‌పి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో సిఐ నాగరాజు రెడ్డి, ఎస్సైలు యాయాతి రాజు,అఖిల , దమ్మపేట ఎస్సై సాయికిషోర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# విప్లవ ద్రోహులకు ప్రజాకోర్టులో శిక్ష తప్పదు

**- బికే ఏఎస్‌ఆర్ డివిజన్ కమిటీ పేరిట విప్లవ లేఖ**

**- ఏజెన్సీలో మరోసారి తీవ్ర చర్చ**



భూస్వామ్య పెత్తందారులారా ఖబడ్ధార్....

మీ ఆగడాలను కూకటి వేళ్ళతో పెకిలిస్తాం.

విప్లవోద్యమం కొనసాగిస్తాం.

విప్లవ

**ప్రజాపక్షం/భద్రాచలం :** భూ స్వామ్య పెత్తందారులారా ఖబడ్దార్, మీ ఆగడాలను కూకటి వేళ్లతో పెకిలిస్తాం, విప్లవోద్యమాన్ని కొనసాగిస్తాం అంటూ భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ పేరిట విప్లవ లేఖ విడుదల చేశారు. ఆ లేఖలోని సారాంశం ప్రకారం, అద్యమానికి ఊపిరిపోస్తూ అమరులైన ఉద్యమకారులకి విప్లవ జోహార్లు, అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ పేరుతో వచ్చిన ప్రకటన నిజం, అది మా పార్టీ విడుదల చేసిది. బూటకపు ఉద్యమాలు, బూటకపు లేఖలు, ప్రజా ప్రజా ఉద్యమాలు చేసే విప్లవకారులకి రావని,ఇంకా కొందరు రాజకీయ బ్రోకర్లు, విలేకర్ల ముసుగులో ఉన్న నీచులు మా పార్టీపై అసత్య ప్రచారం చేస్తున్న ద్రోహులు ఉన్నారని, వారికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదని, అమరుల త్యాగాలను బదులు తీర్చుకుంటాం, విప్లవం పోరాటాలు కొనసాగిద్దాం అంటూ విప్లవ పేరుతో విడుదలైన లేఖలో పేర్కొన్నారు. విప్లవ పేరుతో మరోసారి లేఖ విడుదల కావడంతో ఏజెన్సీ వ్యాప్తంగా తీవ్ర చర్చసాగుతోంది. గత కొద్దిరోజుల క్రితం విప్లవ పేరుతోనే ఓ లేఖ విడుదలైన విషయం విధితమే. ఆ లేఖలో పేర్లతో పాటు ప్రస్తావించారు. తాజాగా భూ స్వాములను మరోసారి హెచ్చరిస్తూనే కొందరు రాజకీయ బ్రోకర్లు, విలేకరుల ముసుగులో మావోయిస్టు పార్టీపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఘాటుగా స్పందించారు. వరుస లేఖలతో ఏజెన్సీ వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ వాతావరణం కొనసాగుతోంది. తీవ్ర సంక్లిష్ట పరిస్థితుల్లో మావోయిస్టు స్థాపన వారోత్సవాలు జరుగుతున్న వేళ, అగ్రనేతలను కోల్పోతున్న తురణంలో విప్లవోద్యమాన్ని ముందుకు తీసుకెళతామంటూ లేఖలను మావోయిస్టు పార్టీ విడుదల చేస్తోంది. పోలీసులు సైతం ఏజెన్సీ వ్యాప్తంగా ఉన్న రాజకీయ నాయకులను అప్రమత్తం చేసింది. స్వగ్రామాలు విడిచి కొద్దిరోజుల పాటు వెళ్లాలని, ప్రజాప్రతినిధులు గ్రామాల్లో పర్యటనలు రద్దు చేసుకోవాలని సూచన చేసిన విషయం విధితమే.

# శ్రీ ఆదర్శలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/చింతకాని :** నాగులవంచ శ్రీ ఆదర్శ విద్యాలయంలో గురువారం ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.చిన్నారులు సాంప్రదాయ దుస్తులు ధరించి తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చి గౌరీదేవికి పూజలు చేశారు.నృత్యాలు చేస్తూ ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ బోడెపుడి కిరణ్ బతుకమ్మ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.